నమస్తే తెలంగాణ

# జగిత్యాల

5 | కరీంనగర్, ఆదివారం 3 నవంబర్ 2024 | JAGTIAL



మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్, చిత్రంలో కొండూరి రవీందర్‌రావు, తోట ఆగయ్య, జిందం చక్రపాణి

# సంజయ్ తిట్ల పురాణం బంజెయ్

- రాష్ట్ర రహదారులపై దృష్టి సారించాలి • మానేరుపై రోడ్‌కం రైల్వే బ్రిడ్జి నిర్మించాలి • మున్సిపల్‌ను తాకకుండా రహదారి వేయాలి
- దుద్దెడ-సిరిసిల్ల రహదారిని కోరుట్ల వరకు పొడిగించాలి
- కేంద్ర మంత్రికి రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు వినోద్ సూచన

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తిట్ల పురాణం బంద్ చేయాలని, రాష్ట్ర రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సూచించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రహదారుల విషయంలో తెలంగాణకు అన్యాయం జరిగిందని, రాష్ట్రం వచ్చిన తర్వాత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గదర్శనంలో తాను ఎంపీగా ఎన్నో జాతీయ రహదారులకు ప్రతిపాదనలు చేశానని గుర్తు చేశారు. సంజయ్ ఐదేళ్లు ఎంపీగా పనిచేశారని, ప్రస్తుతం కేంద్ర సహాయ మంత్రి హోదాలో ఉన్నందున తాను రాజకీయ విమర్శలు చేయడం లేదన్నారు. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల అభివృద్ధిని కాంక్షించి బండి దృష్టికి తీసుకువస్తున్నట్టు తెలిపారు. దుద్దెడ- సిరిసిల్ల రహదారిని కోరుట్ల వరకు పొడిగించాలని, తంగళ్లపల్లి ఊరు బయటి నుంచి వెళ్తున్న రైల్వే ట్రాక్ పక్క నుంచే రోడ్డు వేయాలని, మానేరు నదిపై 1.8 కిలోమీటర్ల రోడ్‌కం రైల్వే బ్రిడ్జికి గత ప్రభుత్వంలోనే ప్రతిపాదనలు పంపామని, పనులు ఆరంభ దశలో ఉన్నందున రాజమండ్రి తరహాలో బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. ఈ వంతెనతో ఆ ప్రాంతం టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చెందుతుందని, దానిపై నుంచి వేములవాడ ఊరి బయట మీదుగా చందుర్తి, కథలాపూర్, కోరుట్ల వరకు ముక్కుసూటిగా రహదారి ఉంటుందని తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని తెలంగాణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బండి సంజయ్ రాజకీయాలను పక్కన పెట్టి జిల్లా అభివృద్ధి కోసం పాటు పడాలని హితవుపలికారు. సూర్యాపేట, సిద్దిపేట- సిరిసిల్ల, వరంగల్- కరీంనగర్- సిరిసిల్ల-కామారెడ్డి-పిట్లం వరకు రెండు జాతీయ రహదారుల కోసం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో ప్రతిపాదనలు చేశారని, అసెంబ్లీలో ఆమోదం తెలిపి కేంద్రానికి పంపించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం జనగామ-సిద్దిపేట రహదారి పనులు తుదిదశకు వచ్చాయని తెలిపారు. సిద్దిపేట జిల్లా దుద్దెడ నుంచి సిరిసిల్ల వరకు చేపడుతున్న 365బీ జాతీయ రహదారిని వేములవాడ, చందుర్తి, కథలాపూర్ మీదుగా కోరుట్ల వరకు పొడిగించాలని, అందుకు కేంద్రానికి ప్రతిపాదనలు చేయాలని కోరారు. ఈ జాతీయ రహదారి పొడిగించడం వల్ల వేములవాడ పుణ్యక్షేత్రానికి వచ్చి పోయే భక్తులకు హైదరాబాద్ వెళ్లేందుకు మార్గం సులువుగా ఉంటుందన్నారు. ప్రస్తుత సిరిసిల్ల-సిద్దిపేట రహదారి ఓ పాములాగా వంకరటింకరగా దాదాపు 39 మలుపులున్నదని, ఈ మలుపులు తొలగిస్తూ గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారి వస్తుందన్నారు. ఢిల్లీలో పనులపై ఫాలోఅప్ చేస్తేనే మంజూరవుతాయని చెప్పారు. సమావేశంలో టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, చేనేత జౌళీశాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, ఏనుగు మనోహర్‌రెడ్డి, బొల్లి రామ్మోహన్, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

### సిరిసిల్ల బయటి నుంచే చేపట్టాలి

సిరిసిల్ల పట్టణ నడిబొడ్డు నుంచి జాతీయ రహదారి నిర్మిస్తే పేద, మధ్య తరగతి ప్రజలు భూములు కోల్పోవాల్సి వస్తుంది. అందుకే పట్టణంలోకి ప్రవేశించకుండా బయటి నుంచి చేపట్టాలి. రోడ్‌కం రైల్వే బ్రిడ్జి నిర్మించాలి. అందుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవ చూపాలి. కాగా, జిల్లాకు వచ్చిన రెండు జాతీయ రహదారులతో సిరిసిల్ల జంక్షన్‌గా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న వారికి అదనంగా డబ్బులు చెల్లించాలి. లేని పక్షంలో నిర్వాసితులతో కలిసి ఉద్యమిస్తాం.

**- వినోద్ కుమార్**

## నిరుద్యోగులకు 5న ఇంటర్వ్యూలు

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, నవంబర్ 2 : ఉమ్మడి జిల్లా పరిధిలోని నిరుద్యోగ అభ్యర్థులకు ఏవీఎస్ స్కిల్స్ అకాడమీ(టాటా క్యాపిటల్స్), శ్రీరాంలైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌లో ఉద్యోగాలకు ఈ నెల 5న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి వై తిరుపతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలోనే ఇంటర్వ్యూలు ఉంటాయని, ఎంపికైన అభ్యర్థులు కరీంనగర్, హైదరాబాద్‌లో పని చేయాల్సి ఉంటుందని చెప్పారు. అభ్యర్థులు విద్యార్హత, తమ బయోడేటా, అనుభవం సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 78160 72851, 72076 59969, 99082 30384 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్

# కవ్వంపల్లీ.. వ్యక్తిగత విమర్శలు మానుకో

దమ్ముంటే అభివృద్ధికి నిధులు తీసుకురా

- చేతకాకపోతే నాతో రా.. నిధులు తీసుకువద్దాం • కవ్వంపల్లి కాదు.. కమీషన్ల సత్యనారాయణ • మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఫైర్

కరీంనగర్ కార్పొరేషన్, నవంబర్ 2 : మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని, లేకపోతే ఆయన చరిత్రను ఆధారాలతో బయటపెడుతానని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ హెచ్చరించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం పని చేయకుండా ఎంత సేపూ బీఆర్‌ఎస్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. అభివృద్ధికి నిధులు తీసుకురావడం చేతకాకపోతే తనతో కలిసి ప్రభుత్వ పెద్దల వద్దకు రావాలని, తనకు ఉన్న వ్యక్తిగత పరిచయాలతో వారిని మెప్పించి నిధులు తెద్దామని సూచించారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడులు చేస్తే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని, అవసరమైతే తొక్కేస్తామని హెచ్చరించారు. ఎన్నికల్లో అడ్డగోలుగా ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ప్రజలు నిలదీస్తారని, వీటిపై బాధ్యతాయుత పదవిలో ఉన్న ఎమ్మెల్యేగా ఓర్పుగా సమాధానం చెప్పాలని సూచించారు. ప్రజలు నిలదీస్తే అది బీఆర్‌ఎస్ వాళ్లే చేస్తున్నారని అనడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటనలు రాకముందే నియోజకవర్గంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారని, అందులో కొనేవారు లేక రైతులు దళారులకు అమ్ముకుంటున్నారని ఆవేదన చెందారు. కొనుగోళ్ల విషయంలో గుండ్లపల్లి వద్ద ఎమ్మెల్యేను రైతులు నిలదీశారని, వారి కడుపు మండి చెప్పులు విసిరేశారని, దీనిని కూడా తామే చేయించినట్టు ఎమ్మెల్యే ప్రచారం చేసుకుంటున్నాడని దుయ్యబట్టారు. పింఛన్లు పెంచుతామని, మహిళలకు భరోసా ఇస్తామని చెప్పి అమలు చేయకుండా గ్రామాల్లోకి వెళ్తే వృద్ధులు ముళ్ల కర్రతో పొడుస్తారని, మహిళలు చీపుర్లతో తిరగబడుతారని హెచ్చరించారు. ఎమ్మెల్యేగా గెలిచి ఏమీ చేయకలేక అసహనంతో బీఆర్‌ఎస్ నాయకులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో అడ్డగోలుగా కమీషన్లు తీసుకొంటున్నారని, అందుకే ప్రజలంతా కమీషన్ల సత్యనారాయణ అని పిలుచుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తాను ఎమ్మెల్యేగా మంజూరు చేయించిన అభివృద్ధి పనులను ఎందుకు క్యాన్సిల్ చేయించారని ప్రశ్నించారు. కమీషన్లు రావనే రద్దుచేసి కొత్తగా టెండర్లు పిలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. డ్యాంపై బ్రిడ్జి కట్టడం కాదు, చేతనైతే గన్నేరువరం డబుల్‌రోడ్డు పనులను పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మార్చారని విమర్శించారు. ఉన్నతచదువులు చదివి అనుచరులతో బూతులు తిట్టించడం పద్ధతా? అని ప్రశ్నించారు. ఆయనకు షాడో ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి తల్లి తనకు కొడుకులు అన్నం పెట్టటం లేదని కలెక్టర్‌కు విన్నవించుకున్నదని, అలాంటి వ్యక్తిని దగ్గర పెట్టుకున్న ఎమ్మెల్యే సంస్కారం ఏంటో ప్రజలకు అర్థమవుతుందన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, బీఆర్‌ఎస్ నాయకులు దేవేందర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, వెంకన్న, మహిపాల్, లింగాల లక్ష్మణ్, శ్రీనివాస్‌రెడ్డి, సంపత్ పాల్గొన్నారు.

### వడ్లు వెంటనే కొనాలి



నాకున్న ఐదెకరాలల్ల వరి కోసిన. పది రోజుల కిందనే మా ఊరు పోతుగల్ కొనుగోలు కేంద్రంలో వడ్లు పోసిన. కొనెటోళ్లు లేరు. వానొచ్చిన ప్రతిసారి ఆగమైతున్నం. వడ్లు ఆరబోసుడు, కుప్ప పోసుడే అయితంది. ప్రభుత్వం రైతుల కష్టాలను చూసైనా స్పందించాలె. వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలె.

**- జిల్లెల లక్ష్మి, పోతుగల్ (ముస్తాబాద్)**



తిమ్మాపూర్ మండలంలో పొలాల వద్దే ధాన్యం తూకం వేస్తున్న కూలీలు



### ఏం జేయాలో తెలుస్తలేదు

నాకున్న మూడెకరాలల్ల వరి ఏసిన. 20 రోజుల కిందనే కోసి మా ఆవునూర్ కొనుగోలు కేంద్రంల పోసిన. అప్పటి సంది కొంటరని ఎదురు చూస్తున్న. మొదట మా ఊరిల కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తే సంతోష పడ్డం. కానీ, ఇప్పటి వరకు కొనెటోళ్లు లేరు. మబ్బులు పడ్డా.. వానలు పడ్డా భయమైతంది. ఏం జేయాలో తెలుస్తలేదు. ఇప్పటికే చానామంది రైతులు ఆగమైతున్నరు. వ్యాపారులకు అగ్గువకే అమ్ముకుంటున్నరు. ప్రభుత్వం మా మీద దయచూపాలె. కొనుగోళ్లు వెంటనే ప్రారంభించాలె.

**- వంగ రాజిరెడ్డి, ఆవునూర్ (ముస్తాబాద్)**



### ధాన్యం పోసి నెలయింది

నాకు ఐదెకరాలున్నది. మా నిజామాబాద్ కొనుగోలు కేంద్రంలో వడ్లు పోసి నెల అయితంది. నేను ధాన్యం పోసినంక పదిహేను రోజులకు సెంటర్ ప్రారంభించిన్రు. కలెక్టర్ సారు వచ్చి వడ్లు చూసి వెంటనే కొనాలని చెప్పిండు. ఎవరూ కొనలేదు. ప్రతి రోజూ ధాన్యం ఆరబెడుతున్నం. వర్షం వస్తదేమోనని భయంతో మళ్లీ కుప్ప పోస్తున్నం. రోజంతా వడ్ల కాడనే ఉంటున్నం. అధికారులు గన్నీసంచులు కూడా వేసిన్రు. వడ్లు కొంటలేరు. అడిగితే మిల్లులు అలాట్‌మెంట్ కాలేదని చెబుతున్రు. ప్రభుత్వం వెంటవెంట వడ్లు కొనాలె. లేదంటే దళారులకు అమ్మడం తప్ప మరో గతి లేదు.

**- ఈర్ల రాజు, నిజామాబాద్ (కోనరావుపేట)**

# ధాన్యం దళారులపాలు

- కేంద్రాలకు కుప్పలు తెప్పలుగా వడ్లు
- ఇంకా మొదలుకాని కొనుగోళ్లు
- వెంటాడుతున్న అకాల వర్షాలు
- ఇదే అదునుగా దళారుల కాంటాలు
- అగ్గువకే అమ్ముకుంటున్న రైతులు
- తూకంలోనూ మోసాలతో నష్టాలపాలు



ముస్తాబాద్ : ఆవునూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేస్తున్న కూలీలు

**రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం అమ్ముకునేందుకు అవస్థలు పడాల్సి వస్తున్నది. కొనుగోలు కేంద్రాల్లో వడ్లు పోసి రోజులు గడుస్తున్నా కొనేదిక్కు లేకుండా పోయింది. ఇప్పటి వరకు ఒక్క క్వింటాల్ కూడా కొనకపోవడంతో 'ఎప్పుడు కొంటారా' అని ఎదురుచూడాల్సి వస్తున్నది. ఓవైపు కొనుగోళ్ల ప్రారంభంకాకపోవడం, మరోవైపు అకాల వర్షాలు వెంటాడుతుండడంతో ఆందోళన కనిపిస్తున్నది. ఈ పరిస్థితుల్లో ధాన్యం దళారుల పాలవుతుండగా, మద్దతు ధర దక్కకుండా పోతున్నది. కొన్నిచోట్ల తూకంలోనూ దోపిడీ చేస్తుండగా, రైతాంగం నిండా మునుగుతున్నది. త్వరగా కొనుగోళ్లు ప్రారంభించి, మద్దతు ధరతో కొనాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నది.**

కరీంనగర్, నవంబర్ 2(నమస్తే తెలంగాణ)/తిమ్మాపూర్: వానకాలం సీజన్ ధాన్యం కొనేందుకు సివిల్ సప్లయ్స్ అధికారులు అక్టోబర్ నుంచే కార్యాచరణను సిద్ధం చేసుకున్నారు. కరీంనగర్‌లో 340, జగిత్యాలలో 421, పెద్దపల్లిలో 311, సిరిసిల్లలో 258 చొప్పున ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,330 కేంద్రాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకొని.. గత నెల 10 తర్వాతి నుంచి కేంద్రాలను ప్రారంభించారు. ఇప్పటి వరకు దాదాపు అన్ని కేంద్రాలను తెరిచినా ఎక్కడ కూడా క్వింటాల్ ధాన్యం కూడా కొనలేదు. నవంబర్ నెల వచ్చినా ఇప్పటి వరకు ఒక్క గింజ కొన్న పాపానపోలేదు. ఇప్పటికే 50 శాతం కోతలు పూర్తయి కేంద్రాలకు ధాన్యం వస్తున్నా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. వరి కోతలు చేసిన రైతులు కేంద్రాల్లో కుప్పలు పోసి ఎప్పుడు కొంటారోనని ఎదురు చూస్తున్నారు. తేమ శాతం అధికంగా ఉందని సాకుతో రేపూ మా పంటూ జాప్యం చేస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. మరోవైపు తుఫాన్ల కారణంగా అకాల వర్షాలు ఉన్నాయనే వార్తలతో భయపడిపోతున్నారు. ఇప్పటికే అక్కడక్కడా కురిసిన వర్షాలతో కేంద్రాల్లోని ధాన్యం తడుస్తున్నది. ప్రతి రోజూ కేంద్రాల వద్ద ధాన్యం ఆరబెట్టడం, కుప్పలు చేసి టార్పాలిన్లు కప్పుకోవడం నిత్య కృత్యంగా మారింది. గత నెల మొదటి వారంలో వరి కోసిన రైతులు సుమారు నెల రోజులుగా ఇదే పని చేస్తున్నారు. మరింత ఆరితే తూకం తగ్గి తమకు నష్టం వస్తుందని వాపోతున్నారు.

### ఒక్క కిలో కొనలేదు

కరీంనగర్ జిల్లాలో వానకాలం సీజన్‌లో మొత్తం 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్న అధికారులు, అక్టోబర్‌లో 23 శాతంగా 91,894 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఇక నవంబర్‌లో 58 శాతంగా 2,34,029 మెట్రిక్ టన్నులు, డిసెంబర్‌లో 16 శాతంగా 63,826, వచ్చే ఏడాది జనవరిలో 3 శాతంగా 10,251 మెట్రిక్ టన్నులు కొనాలని నిర్దేశించుకున్నారు. అయితే అక్టోబర్ నెలలోనే కాదు, ఇప్పటి వరకు ఒక్క బస్తా ధాన్యం కూడా కొనలేదు. ఒక్క కరీంనగర్ జిల్లాలోనే కాదు, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి.

### దక్కని మద్దతు ధర

కొనుగోళ్లు ప్రారంభించకపోవడం, మరోవైపు అకాల వర్షాల భయం వెంటాడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో దళారు లు, మిల్లర్లు, ఇతర వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్రం ఈ యేడాదికి ప్రకటించిన కనీ స మద్దతు ధర కూడా దక్కడం లేదు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు ₹2,320, సాధారణ రకానికి ₹2,300 కనీస మద్దతు ధర ఉంటే.. ₹1,800 మించి ధర పెట్టడం లేదు. అంటే రైతులు ఒక క్వింటాల్‌పై కనీసం ₹500పైనే నష్టపోవాల్సి వస్తున్నది. డబ్బు అవసరం ఉన్న రైతులు తేమశాతం తగ్గిన ధాన్యాన్ని కూడా అగ్గువకే అమ్ముకోవాల్సిన పరిస్థితి కనిపిస్తున్నది.

*ధాన్యం దళారులపాలవుతున్నదనడానికి ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లే నిదర్శనంగా నిలుస్తున్నది. గత ప్రభుత్వ హయాంలో ప్రతి సీజన్‌కు రాగట్లపల్లి కొనుగోలు కేంద్రంలో ఐదు వేల క్వింటాళ్ల వరకు కొనుగోళ్లు జరిగేవి. ప్రస్తుత ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను అట్టహాసంగా ప్రారంభించినా, ఇప్పటి వరకు కొనుగోళ్లు ప్రారంభించలేదు. దీంతో రైతులు నెలరోజులుగా కొనుగోళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. అకాల వర్షాలతో కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నారు. ఇటీవల వడ్లు మొలకెత్తడంతో ఆందోళన చెంది, దళారులకు అమ్మేందుకు సిద్ధపడ్డారు. ఇప్పటికే క్వింటాల్‌కు ₹1,870 చొప్పున 9 లారీల ధాన్యం అమ్మేసుకున్నారు. ఇంకా నాలుగైదు లారీల వడ్లు మాత్రమే మిగిలాయని రైతులు చెబుతున్నారు. ₹500 బోనస్ వస్తుందని ఆశతో సన్నవడ్లను అమ్ముకుండా ఉంచామని, అవి కొంటారో, కొనరో ఇంకా అర్థం కావడం లేదని వాపోతున్నారు.*

### తూకంలోనూ తేడా!

రైతుల దీన స్థితిని ఆసరా చేసుకుంటున్న దళారులు, ఇతర వ్యాపారులు ఇటు ధర తగ్గించడమే కాకుండా తూకంలోనూ మోసం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పచ్చి వడ్లని రెండు మూడు కిలోలు, సంచి బరువని మరో కిలో తీస్తూ కాంటాలో కూడా దోపిడీకి తెర లేపారు. ఇటీవల తిమ్మాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో స్థానిక రైస్ మిల్లులో వేసిన తూకంలో క్వింటాల్‌కు రెండు కిలోలు తక్కువ వచ్చిన విషయం తెలిసిందే. ఈ మండలంలోని మొగిలిపాలెం, పర్లపల్లి, నల్లగొండ, పోలంపల్లి గ్రామాల్లో సగానికిపైగా కోతలు పూర్తయ్యాయి. ఇప్పుడు ఈ గ్రామాలకు వెళ్లే దారుల్లో ఎక్కడ చూసినా ధాన్యం కుప్పలే కనిపిస్తున్నాయి. అయితే మిల్లులు అలాట్ కాకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో ఒక్క గింజ ధాన్యం కూడా కొన్నది లేదు. ఈ పరిస్థితుల్లో రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అప్పగించక తప్పని నిస్సహాయతకు వస్తున్నారు. దీనిని ఆసరా చేసుకుని ఇష్టానుసారంగా దోపిడీ చేస్తున్నారు. తూకంలో దోపిడీపై మీడియాకు సమాచారం ఇచ్చిన రైతులను కూడా దళారులు బెదిరిస్తున్నారు. ఇదంతా చూస్తుంటే 2014 కు ముందు ఉమ్మడి రాష్ట్రంలో పరిస్థితులు పునరావృతం అవుతున్నాయా..? అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు తక్షణమే కొనుగోళ్లు ప్రారంభించి, రైతులకు కనీస మద్దతు ధర దక్కేలా చూడాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### వశంగాక 70 క్వింటాళ్ల వడ్లను అమ్మిన



మాకు మూడెకరాల పొలం ఉన్నది. అందుల దొడ్డు వడ్లు, సన్నవడ్లు పెట్టినం. పెత్రమాస నాడు కల్లంలకు తెచ్చినం. నెల కింద గవుర్మెంటుకే అమ్ముకోవాలని సార్లు కేంద్రం చాలు చేసిన్రు. ఇప్పటి దాక ఇటు మొకాన సూసినోళ్లు లేరు. ఎప్పుడు మొగులైతదో ఎప్పుడు వానత్తదో అని భయ పడుతున్నం. నాల్గు సార్ల ఎండబోసి, వానచ్చిన ప్రతిసారి మల్ల, మల్ల నేర్పినం. వడ్లు ల్యాకలు రావట్టె. ఇగ వశంగాక, దిక్కులేక 70 క్వింటాళ్ల వడ్లను అమ్మేసిన. ఇంక సన్నపడ్లు ఈడనే ఉన్నయ్. అవన్న కొంటరో, కొనరో తెల్వది. సార్లు ఒకసారి ఇటు రండి. నెల రోజుల సంది ఎంత ఇబ్బంది పడుతున్నరో సూడున్రి.


**-చేకూటి ఎల్లవ్వ, మహిళా రైతు, రాగట్లపల్లి (ఎల్లారెడ్డిపేట)**



ఎల్లారెడ్డిపేట : రాగట్లపల్లిలో ధాన్యం బస్తాలతో లారీ

# రైతుల కోసం పాదయాత్ర చేస్తా

- 12న కోరుట్ల నుంచి జగిత్యాల కలెక్టరేట్ వరకు చేపడుతా • కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల • మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు హాజరవుతారని వెల్లడి



ఇబ్రహీంపట్నం: కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

మల్లాపూర్/ ఇబ్రహీంపట్నం, నవంబర్ 2 : రైతు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 12న కోరుట్ల నుంచి జగిత్యాల కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేస్తానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల స్పష్టం చేశారు. శనివారం మల్లాపూర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో 41 మంది లబ్ధిదారులకు ₹11,92,500 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం రైతు వేదిక వద్ద 16 మందికి ₹16,01,856 విలువైన కల్యాణలక్ష్మి, 46 మందికి ₹13,42,300 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల మాట్లాడారు. వరంగల్ డిక్లరేషన్ పేరుతో కల్లబొల్లి మాటలు చెప్పి రైతులను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ధ్వజమెత్తారు. చెప్పిన మాట మీద నిలబడకుండా ₹2 లక్షల రుణమాఫీతోపాటు పెట్టుబడి సాయం ఇప్పటి వరకు అందించడం లేదని విమర్శించారు. తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కరోనా వంటి విపత్కర పరిస్థితులు వచ్చినా రైతులు, ప్రజలకు ఏనాడూ సంక్షేమ పథకాలను ఆపలేదని గుర్తుచేశారు. త్వరలోనే మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం వస్తుందని, ప్రజలు ధైర్యంగా ఉండాలని సూచించారు. కల్యాణలక్ష్మి చెక్కులు తాను ఇప్పించానని, ఎవరు పైసలు అడిగినా రాళ్లతో కొట్టాలని మహిళలకు చెప్పారు. తాను చేపట్టే పాదయాత్రకు పార్టీలకతీతంగా నాయకులు, రైతు సంఘాల నాయకులు, రైతులు సమష్టిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ పాదయాత్రకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరవుతారని తెలిపారు. ఆయా చోట్ల తహసీల్దార్ ప్రసాద్, సింగిల్ విండో చైర్మన్ బద్ధం గోపి, సివిల్ సప్లై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉమాపతి, కో ఆపరేటివ్ సొసైటీ ఇన్‌స్పెక్టర్ నిజామొద్దీన్, ఏవో రాజ్‌కుమార్, మార్కెట్ కమిటీ కార్యదర్శి సురేందర్, సహకార సంఘం కార్యదర్శి సతీశ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు తోట శ్రీనివాస్, ఎలాల దశరథ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ కాటిపల్లి ఆదిరెడ్డి, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ కదుర్క నర్సయ్య, మాజీ వైస్ ఎంపీపీలు గౌరు నాగేశ్, నోముల లక్ష్మారెడ్డి, సర్పంచుల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు మైదాస్ శ్రీనివాస్, ఎంపీటీసీల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు ఏనుగు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోరుట్ల రూరల్ : పట్టణంలో జాతీయ రహదారిపై కమ్ముకున్న పొగమంచు

### పొగమంచు.. కనువిందు..!

ఆకాశమంతా పొగమంచు నిండి చూపరులను కనువిందు చేసింది. శనివారం ఉదయం పొద్దుపొడిచే వేళ.. ప్రకృతి అందాలను మైమరిపించింది. పొలాలు, ప్రధాన రహదారులపై కురుస్తూ చూపరులను కట్టిపడేసింది. ఉదయం పూట వెళ్లిన విద్యార్థులు, వాహనదారులు, ప్రజలు పొగమంచు అందాలను ఎంజాయ్ చేయడం కనిపించింది.

**- కోరుట్ల రూరల్ / మారుతీనగర్, నవంబర్ 2**

## ప్రాథమికోన్నత, ఆ పైస్థాయి ఉపాధ్యాయులకే ఓటు హక్కు

కరీంనగర్ కలెక్టరేట్, నవంబర్ 2 : త్వరలో జరుగబోయే కరీంనగర్- ఆదిలాబాద్- నిజామాబాద్- ఖమ్మం ఉపాధ్యాయ శాసన మండలి నియోజకవర్గ ఎన్నికల్లో ప్రాథమికోన్నత, ఆ పైస్థాయిలో బోధించే ఉపాధ్యాయులు, అధ్యాపకులకే ఓటు హక్కు కల్పిస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ వెల్లడించింది. ఈ మేరకు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి భన్వర్‌లాల్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జీవో నంబర్ 49 ప్రకారం గత ఎన్నికల్లో మాదిరి ఈసారి కూడా ప్రాథమికోన్నత స్థాయి పాఠశాలల నుంచి మొదలు విశ్వవిద్యాలయ స్థాయిలో బోధించే అధ్యాపకులు మాత్రమే ఓటరుగా నమోదు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలతో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థలు, ఆంగ్లో ఇండియన్ పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులకు ఈ అవకాశం కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు.

# రాజన్న ఆలయానికి కార్తీక శోభ



రాజన్న ఆలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వేములవాడ టౌన్, నవంబర్ 2: వేములవాడ రాజన్న సన్నిధి కార్తీక శోభ సంతరించుకున్నది. కార్తీక మాసం ప్రారంభంకావడంతో ఆలయ ప్రాంగణం కార్తీక దీపకాంతుల్లో శనివారం దేదీప్యమానంగా దర్శనమిచ్చింది. మొదటిరోజు అర్చకులు వేదమంత్రాల మధ్య కార్తీకదీపాన్ని వెలిగించి ప్రదోషకాలంలో గండదీపంపై ఉంచారు. ఈ ఆకాశదీపం కార్తీకమాసం మొత్తం వెలుగుతూనే ఉంటుందని తెలిపారు. ఆలయ ఓపెన్‌స్లాబ్‌పై దీపోత్సవాన్ని అర్చకుల వేదమంత్రోచ్చారణల మధ్య ఈవో వినోద్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా.. స్వస్తిక్, ఓం నమఃశివాయ రూపాల్లో భక్తులు దీపాలను వెలిగించి భక్తిని చాటుకున్నారు. దాదాపు 20 వేలకుపైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.14లక్షలకు పైగా ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు వెల్లడించారు.